

# మే!మే! మేకపిల్ల

ముత్యాలమ్మ జాతర జోరుగా ఉంది. మూడు రోజుల ముందు నుంచి వూళ్లో చల్లకుండ తిరుగుతోంది. ఆ రోజు బలులు. ముత్యాలమ్మ విగ్రహం హూంకరిస్తోంది. చేతిలో కత్తి. ఆ కత్తికి గుచ్చిన నిమ్మపండు.

గుడిముందు పందిళ్ళు వేశారు. ఆ పందిళ్ళనిండా జనం తొక్కిసలాడుతున్నారు. ఓ పక్క తాటాకుల మంట వేసి తప్పెట్లు కాస్తున్నారు. మేకలకి, కోళ్ళకి బొట్లు పెట్టి గుడిచుట్టూ ప్రదక్షిణం చేయించి బలికి తీసుకొస్తున్నారు. తప్పెట్లు పెరీలు

పెఠీల్మని మోగుతున్నాయి. రుంజలు, కొమ్ముబూరాలు హోరున మోగుతున్నాయి. పంబలోళ్ళు, బైనీడివోళ్ళు వీరంగం తొక్కుతున్నారు. మాతంగి చిందు తొక్కుతోంది. మాతంగి చిందేస్తుంటే ఆమె మెళ్ళో గవ్వల పేర్లు ఎగిరెగిరి పడ్తున్నాయి. మాతంగి ముఖంనిండా కుంకం మెత్తుకుంది. జుట్టు విరబోసుకుంది. ఒక చేతిలో వొంకులొంకుల దండం. ఆ దండం లయగా వూపుతూ అడుగేస్తుంటే జనమంతా మాతంగి చుట్టూ చేరారు. అప్పటికప్పుడే మూడు నాలుగు కోళ్ళు అమ్మవారికి బలి యిచ్చారు. సిద్ధయ్య తన కొడుకు పదేళ్ళ పోలయ్యతో మొక్కుబడి తీర్చుకోటానికి గుళ్ళ దగ్గర కొచ్చాడు. పోలయ్యకు ఆరేళ్ళవయసులో పెద్ద జబ్బు చేస్తే సిద్ధయ్య ముత్తాలమ్మకు మొక్కుకున్నాడు. ప్రదక్షిణం పూర్తిచేసి అమ్మవారి కుంకుం నుదుట పెట్టుకుని రావిచెట్టు దగ్గర కొచ్చారు తండ్రి, కొడుకులు. సిద్ధయ్య చాకలిని పిలిచి మా మొక్కుబడి మేక ఏదిరా?' అనడిగాడు. రావిచెట్టుకు కట్టివున్న అనేకానేక మేకల్లో ఒక మేకని చూపించాడు చాకలి. పోలయ్య అన్ని మేకల్ని చూశాడు. ఆ పసివాడి చూపు ఒక చోట ఆగిపోయింది. అక్కడ తను రోజూ అడుకునే మేకపిల్ల ఉంది. దానిక్కూడా బొట్టు పెట్టి మెళ్ళో వేపాకులు కట్టారు. దాన్ని కూడా బలిస్తారేమో అనిపించేసరికి పోలయ్యకి భయం వేసింది. తను రోజూ ఆడుకునే మేకపిల్ల! తన మెడమీద కాళ్ళు వేసి తన మూతి నాకే మేకపిల్ల! దాని మెడ కోసి చంపుతారు! పోలయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

బలికి సిద్ధం చేసిన మేకలు రావిచెట్టుకు కట్టి ఉన్నాయి. అవి అందీ అందని రావి ఆకులకోసం ఎగుర్తూ "మే! మే! " అని అరుస్తున్నాయి.

ఆ ఆకు లందవు. ఇంక కొద్ది క్షణాల్లో తమకు ఎగిరే పని ఉండదు అని వాటికి తెలియదు. ఎదురుగా ఓ గొర్రెపోతుని బలిచ్చినప్పుడు మేకలు చూశాయేమో, అక్కణ్ణించి "మే! మే!" అని అరుపులు ఎక్కువయినాయి! తాళ్ళు గింజుకుంటూ, జాలి చూపులు చూస్తూ దీనంగా "మే! మే!" అని అరుస్తున్నాయి. పోలయ్య

మేకపిల్ల మరీ అరుస్తోంది. ఇంతలో గణాచారికి శివమెత్తుకొచ్చింది. ద ద ద ....... అంటూ రయ్యిన అమ్మవారి దగ్గరికి పరుగెత్తాడు. రయ్యిన పోతుబండ దగ్గర కొచ్చాడు. వేపాకులు కస కస నమిలేస్తున్నాడు. నిమ్మకాయలు కొరికి విసిరేస్తున్నాడు. తప్పెట్ల మోతలో వూగిపోతూ అరుస్తున్నాడు. "ఒరేయ్! నేను ముత్తాలమ్మనురా! నాకు కోపం తెప్పిస్తార్రా! మిమ్మల్ని ఏం చేస్తానో చూసుకోండ్రా! నమిలి మింగేస్తాన్రా! ఈ ఊళ్ళో పసిపిల్ల బాలాదిని పట్టుకుంటాన్రా! ఈ ఊరు నేలమట్టం చేస్తాన్రా! "

జనమంతా వణికిపోతూ గణాచారి దగ్గరకు చేరారు. పెద్దరైతు కోటయ్య చేతులు జోడించి ఊరందరి తరపున వేడుకున్నాడు. "మా తప్పులు కాయమ్మా! మమ్మల్ని రచ్చించదమ్మా! మేవేం చేయాలో శలవీయమ్మా!"

గణాచారి మళ్ళీ అందుకున్నాడు. "హూ! మీ తప్పు మీకు తెలియలేదంట్రా! ఔన్రా! మీకు కళ్ళు కనిపిస్తాయంట్రా! మన్నూ మిన్నూ కానొస్తాయంట్రా! మి పంటలు పండించింది నేను గాదంట్రా! మీకు గొడ్డూ గోదా ఇచ్చింది నేను గాదంట్రా! మీకు పిల్లా పాపా ఇచ్చింది నేను గాదంట్రా! అట్టాంటి నాకు లోపం చేసి మీరు కులుకుతున్నారంట్రా! ....."

"చెప్పు తల్లీ! మా తప్పు చెప్పు! సర్దుకుంటాం" అన్నాడు కోటయ్య.

"ఇంకా చెప్పాలంట్రా! నా నాలికెండి పోతందిరా! నాకు దాహం సరిపోయిందంట్రా! నా కాకలేస్తందిరా! నాకు తిండి సరిపోయిందంట్రా! ఏటేటా ఆరు కల్లు బానలు తెప్పించేవోరు. ఈ ఏడు నాలుగే తెప్పించారు. ఎనుబోతుని బలియ్యకుండా కోళ్ళని, మేకల్ని బలేస్తున్నారు. నేను చల్లగ మిమ్మల్ని చూడాలంటే మరారు కల్లు బానలు తెప్పియ్యండి! దున్నపోతుని బలియ్యండి. లేకపోతే ఊరంతా తినేస్తాను, కిష్టంతా తాగేస్తాను ......" మళ్ళీ కసకస వేపాకులు నమిలి చిందులు తొక్కాడు గణాచారి.

"అట్టాగే తల్లీ .... ఇప్పుడే కల్లు తెప్పిస్తాం. ఇప్పుడే దున్నపోతుని బలిస్తాం......
అని కోటయ్య చెప్పగా "శాంతించు తల్లీ!" అని జనమంతా దణ్ణాలు పెట్టారు. ధూపం వేసి వేపాకు మండల్తో విసుర్తుంటే గణాచారి శాంతిస్తున్నాడు. కల్లుబానలకోసం కబురు వెళ్ళింది. దున్నపోతు కోసం మనిషి వెళ్ళాడు.

అరగంటలో ఆరు కల్లుబానలు వచ్చాయి. మరి కాస్సేపటిలో దున్నపోతూ వచ్చింది. పోతుకి అలంకారం చేసి నుంచో పెట్టారు. కల్లుబానలు చూడగానే గణాచారికి సంబరమైంది. తప్పెట్లు, రుంజలు ఒక్కుమ్మడిగా మోగాయి. ముంతతో కల్లు ముంచి గటగట తాగాడు గణాచారి. ముంతపై ముంత, ముంతపై ముంత ఆరుముంతలు ఆపకుండా గొంతులో పోశాడు. వచ్చిన జనమంతా తలా ఒక ముంత తాగారు. మాతంగి పొంగిపోయింది. గణాచారి మళ్ళీ వేపమండలు వూపుతూ "సంబరమైందిరా! శాంతించానురా! చల్లంగ చూస్తానురా!" అంటూ "వెయ్యండ్రా వీరంగం! వాయించండ్రా నాయాళ్ళూ" అని పెద్దగా అరిచాడు.

వాద్యాలన్నీ ఒక్కసారి మోగాయి. గణాచారి, మాతంగి అంతా చిందులు తొక్కుతున్నారు. వాళ్ళతోపాటు జనమంతా అడుగేస్తున్నారు. ఎక్కడ లేని సంబరంతో అడుగేస్తున్నారు. కొందరు బలిదున్న చుట్టూ తిరుగుతున్నారు. కొందరు మాతంగి చుట్టూ తిరుగుతున్నారు. కొందరు వాళ్ళ చుట్టూ వాళ్ళే తిరుగుతున్నారు. వాద్యాలు, చిందు తప్ప జనమంతకి వేరే లోకం లేదు.

ఆ సమయాన పదేళ్ళ పోలయ్య మెల్లిగా రావిచెట్టు దగ్గరకొచ్చి మేకల్ని కట్టేసిన తాడు విప్పేశాడు. దాంతో మేకలన్నీ ఒక్క గెంతు గెంతి మే! మే! అంటూ పొలాల మీదకి పరుగులు తీశాయి. పోలయ్య నేస్తం మేకపిల్ల చెంగున పోలయ్య మీంచే గెంతి పారిపోయింది. కల్లుతాగి వాద్యాల హోరులో చిందు తొక్కుతున్న జనం ఇది చూశారో లేదో తెలియదు. కాని పోలయ్య మాత్రం ఆనందంతో చప్పట్లు చరుచుకుంటూ ఇంటివైపు పరుగెత్తాడు. *